గోకుల గోపాల కృష్ణా



ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సందడిగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో కృష్ణుడి, గోపికల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లోని దేవాలయాలు భక్తులతో సందడిగా మారాయి.

–ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం

















పాతమలక్‌పేటలోని మల్లికార్జున, వీరాంజనేయ స్వామి దేవాలయంలో కృష్ణాష్టమి సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న ధర్మకర్తలు, కమిటీ సభ్యులు



వేడుకల్లో చంపాపేట ప్రాథమిక పాఠశాల చిన్నారులు



ప్రదర్శన ఇస్తున్న శ్రీ సరస్వతీ చిన్నారులు



నాగోలులో శ్రీ కృష్ణుడి ఊరేగింపు ర్యాలీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న భక్తులు



గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు



ఆర్‌కేపురంలో నిర్వహించిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో ఉట్టి కొడుతున్న ఇస్కాన్ ప్రతినిధులు, కాలనీవాసులు



శ్రీసాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో పూజలు చేస్తున్న భక్తులు



జయంతిక, అక్షదసాయి

ఫిర్యాదుకు స్పందించిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

హస్తినాపురం: ఇంటి అద్దె కోసం వెళ్తే కులం పేరు అడిగి అద్దెకివ్వమని అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా వనస్థలిపురం పోలీసులు పట్టించుకో లేదు. ఈ విషయమై బాధితురాలు సాక్షితో తన గోడు వెల్లబుచ్చుకుంది. నెల 23న 'ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. సదరు మహిళను అవమానించిన వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలు మాలతి మాట్లాడుతూ.. వనస్థలిపురం పోలీసులు పలుకుబడి ఉన్నవారు, పైరవీకారులకు మాత్రమే స్టేషన్‌లో ప్రాధాన్యం ఇస్తున్నారని, సాధారణ ప్రజలు న్యాయం కోసం స్టేషన్‌కు వెళ్తే ఎలాంటి ఫలితం లేకుండా పోతుందన్నారు.ఉన్నతాధికారులు సాధారణ ప్రజలకు సత్వర న్యాయం జరిగేలా చొరవ చూపాలన్నారు.

మీడియా పేరుతో బెదిరింపులు

ఇద్దరిపై కేసు

చైతన్యపురి: బోర్ వేస్తున్న వ్యక్తిని బెదిరిస్తూ దుర్భాషలాడిన ఇద్దరిపై కేసు నమోదైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్ ద్వారకాపురి కాలనీలో ఉండే పాలకుర్తి వేణుగోపాల్ తన స్థలంలో బోర్ వేస్తున్నాడు. అదే సమయంలో నంబర్ లేని బైక్‌పై ఇద్దరు వ్యక్తులు వచ్చి తాము మీడియా ప్రతినిధులమని బోర్ వేసేందుకు అనుమతి చూపించాలని వేణుగోపాల్‌ను అడిగారు. మీకెందుకు చూపించాలని ప్రశ్నించగా సదరు వ్యక్తులు సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తూ దుర్భాషలాడారు. తమకు రూ.20 వేల ఇవ్వకపోతే ఇల్లు ఎలా కడతావో చూస్తామని బెదిరింపులకు దిగారు. వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



సూరజ్ కుమార్

చైతన్యపురి: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన చైతన్యపురి, నాగోలు పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోటు చేసుకున్నాయి. ఏఎస్‌ఐ శేఖర్ వివరాల ప్రకారం.. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన సూరజ్‌కుమార్, నీరజ్‌కుమార్ అన్నదమ్ములు. బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉంటూ బండిపై ఐస్‌క్రీమ్ అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 6న సూరజ్‌కుమార్ (27) మద్యం తాగి ఇంటి రాగా తమ్ముడు నీరజ్ కుమార్ మందలించాడు. సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి ఎంతకీ తిరిగిరాలేదు. సొంతూరికి వెళ్లొచ్చని భావించి కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా అక్కడకు రాలేదని చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు

మరో ఘటనలో యువతి..



సుమలత

నాగోలు: నాగోలు జైపురికాలనీలో నివాసముండే బండారి సుమలత(24) స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తుంది. ఆదివారం తల్లితో పాటు ఇతర కుటుంబ సభ్యులు పనికి వెళ్లారు. సాయంత్రం కుటుంబ సభ్యులు వచ్చేసరికి సుమలత కనిపించలేదు. ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులతో ఆరా తీసినా ఫలితం లేకపోవడంతో తల్లి సీతవర ప్రసాదిని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమోటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.31, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.25, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.15, క్యారెట్ రూ.55, దొండ రూ.23, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.50, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.15, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.45, అర్వి రూ.40, మునగ రూ.35, చిలుకడ దుంప రూ.50, బీట్‌రూట్ రూ.26, కీర రూ.26, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.45.
ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకుందాం



జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీలను సన్మానిస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో ఉన్న ఉద్యోగులందరూ సంఘటితమై సమస్యలను పరిష్కరించుకుందామని టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కార్యాలయంలో మార్కెట్ కమిటీ ఉద్యోగుల సెంట్రల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చిలుక నరసింహారెడ్డి, కార్యదర్శి ముత్రం ఆధ్వర్యంలో టీఎన్జీవో కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన మారం జగదీశ్వర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేనీకు ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ.. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యోగుల గురించి మాట్లాడే నాథుడే కరువయ్యాడని అన్నారు. కొన్ని సంఘాల మాటలతో ఉద్యోగులు ప్రభుత్వానికి దూరం అవుతున్నారని, ఉద్యోగులను ఇబ్బంది పెట్టే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు, డీఏ, పీఆర్సీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముజీబ్ మాట్లాడుతూ..010 పద్దు నుంచి మార్కెటింగ్ ఉద్యోగులకు జీత భత్యాలు ఇవ్వాలన్నారు. మార్కెట్ ఆదాయాన్ని బట్టి పునర్విభజన చేయాలని, 25 సంవత్సరాలుగా పునర్విభజన చేయలేదని వెంటనే ఆ పనిని చేపట్టేలా మంత్రిని కోరుతామన్నారు. దాదాపు మార్కెటింగ్ శాఖలో 1800 మంది ఉద్యోగులు ఉంటే 1200 మంది పదవీవిరమణ చేశారని, ఖాళీల భర్తీపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణ గౌడ్, లక్ష్మణ్, కొండల్ రెడ్డి, పర్వతాలు, గోవర్ధన్ రెడ్డి, సంతోష్ పాల్గొన్నారు.

ప్రత్యేక పాఠశాలలో.. కెన్యా క్రీడాకారులు



మానస ఆరోగ్య వైకల్యాల పాఠశాలలో కెన్యా క్రీడాకారులు

నాగోలు: కొత్తపేట మోహన్‌నగర్‌లోని మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ, ప్రత్యేక పాఠశాలను సోమవారం కెన్యా క్రీడాకారుల బృందం సందర్శించింది. మానసిక వైకల్యం ఉన్న పిల్లలకు అందిస్తున్న చికిత్స, సదుపాయాలను పరిశీలించారు. హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కెన్యాకు చెందిన మారథాన్ రన్నర్స్ ఎజికిల్ కిప్కొరిర్, షీలా చెలంగాట్, జెనిత్ కిప్ప, హమింగ్టన్ చెరోప్ పాల్గొన్నారు. వీరు ఆగస్టు 25న జరిగిన ఎన్ఎండీసీ హైదరాబాద్ మారథాన్ 2024 పోటీల్లో వివిధ పతకాలు గెలుపొందారు. ఈ బృందంలో ఢిల్లీకి చెందిన మారథాన్ రన్నర్ విపుల్, ఉత్తరాఖండ్‌కు చెందిన భగీరథి, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సునీల్‌శర్మ, ప్రస్తుతం భారత సైన్యంలో పనిచేస్తున్న విజయనగరానికి చెందిన భగత శ్రీను ఉన్నారు. హైదరాబాద్ రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రాజేష్ వెట్చ, స్మిత చామిలింగ్, కె. సుందర్ నాగేష్, విజిగీష, గౌతమ్ ప్రత్యేక పాఠశాల ప్రిన్సిపాల్ లింగాల లక్ష్మి, మెర్సీ మధురిమ పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన బీసీ సంఘాల ఆమరణ నిరాహార దీక్ష



మన్సూరాబాద్ జడ్జెస్‌కాలనీలో దీక్ష చేస్తున్న బీసీ సంఘాల నేతలు

మన్సూరాబాద్: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు, సమగ్ర కులగణన చేయాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల నేతలు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష రెండో రోజుకు చేరింది. ఆదివారం హైదర్‌గూడలోని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ కార్యాలయంలో దీక్షను ప్రారంభించగా రెండవ రోజు సోమవారం మన్సూరాబాద్‌లో కొనసాగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న దీక్షా శిబిరానికి చేరుకుని మద్దతు పలికారు. దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ అధ్యక్షుడు జక్కిలి సంజీవ్‌నేత, రజక రిజర్వేషన్ పోరాట సంఘం అధ్యక్షుడు చాపర్తి కుమార్‌ను బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్‌యాదవ్, బహుజన సేన గౌరవ అధ్యక్షుడు కదిరే కృష్ణ, సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు మద్దతు పలికారు.

గోసంరక్షణ అందరి బాధ్యత



చంచల్‌గూడ: కులమతాలకతీతంగా గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాదన్నపేట మార్కెట్ గోశాల చైర్మన్ సహదేవ్‌యాదవ్ అన్నారు. సోమవారం మాదన్నపేట మార్కెట్ గోశాలలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ.. ముక్కోటి దేవతల ప్రతిరూపాలైన గోవులను రక్షించడం అందరూ బాధ్యతగా భావించాలన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి శ్యామ్‌కుమార్, ఉగాది మహేష్, నిరంజన్‌యాదవ్, సుధీర్, వెంకట్‌రెడ్డి, అనిల్‌కుమార్, యోగి, వరుణ్, నాగరాజు, సురేందర్‌రెడ్డి, వీరేందర్‌యాదవ్, శశిధరెడ్డి, బుచ్చిరెడ్డి

సేవా దృకృథంతో ముందుకు సాగాలి

మలక్‌పేట: ఆధ్యాత్మిక పరిచర్యతో పాటు సేవా దృక్పథంతో ముందుకు సాగాలని రాక్‌చర్చి సీనియర్ పాస్టర్ బిషప్ తిమోతి కొల్లబత్తుల అన్నారు. సోమవారం మలక్‌పేట రాక్‌చర్చిలో నిర్వహించిన ఈస్ట్ హైదరాబాద్ క్రిస్టియన్ అసోసియేషన్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రైస్తవ సేవ కార్యక్రమాల్లో ఎదురయ్యే ఒడిదొడుకులు తట్టుకుని నిలబడాలన్నారు. ఐక్యత కలిగి పరిచర్య చేయడంతో ఆత్మీయ జీవితంలో మేలు జరుగుతుందన్నారు. మెథడిస్ట్ చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ శ్రీనివాస్ రాబర్ట్ బైబిల్ లేఖనాలు బోధించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సాల్మన్‌రాజ్, కుమార్ భాస్కర్, పాస్టర్లు, క్రిస్టియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొట్టడంతో వ్యక్తి మృతి

హస్తినాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డినగర్‌కాలనీ నుంచి ఎస్‌కేడినగర్ కాలనీ వైపు ఆదివారం రాత్రి ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా అదే సమయంలో వేగంగా వచ్చిన ఆటో (టీఎస్ 12 యూసీ 1612) ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్ కొత్ర శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మృతుడికి 60 ఏళ్లు ఉంటాయని సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

పేదల ఇళ్లను కూల్చొద్దు



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: సరూర్‌నగర్ చెరువులో ఆక్రమణలు జరిగాయని, ఈ ప్రాంతంలో సైతం పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. వాటిని కూల్చివేస్తారనే భయంతో ఉన్నారని పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి కట్టుకున్న ఇళ్ల జోలికి రావొద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. చెరువులకు దగ్గరలో ఇళ్లను నిర్మించుకున్న పేద ప్రజలు భయపడాల్సిన అవసరం లేదన్నారు. పేదల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వ అండగా ఉంటుందన్నారు. లింగోజిగూడ డివిజన్ పరిధిలోని గ్రీన్‌పార్క్‌కాలనీ, తపోవన్ కాలనీ, సింగరేణి కాలనీల్లో కొంత భాగం సరూర్‌నగర్ చెరువు అనుకుని ఉందని ఈ ప్రాంతాల్లో పేదలు ఎప్పటి నుంచో స్థిర నివాసం ఏర్పచుకొని ఉంటున్నారని వారి ఇళ్లను కూల్చొద్దని వినతిలో కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



వనస్థలిపురం: వనస్థలిపురం శారదానగర్‌లోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యజ్ఞభగవాన్, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, ఉపాధ్యక్షులుగా ప్రసన్నాంజనేయులు, బి.సుభాషిణి, సహాయ కార్యదర్శులుగా ఏ.విష్ణుమూర్తి, జి.అంజనాదేవి, కోశాధికారిగా ఎం.మధుసూదన్, సహ కోశాధికారిగా లక్ష్మీబాయి, కార్యవర్గ సభ్యులుగా వి.లక్ష్మి, వీఆర్‌కే.హన్మంతరావు ఎన్నికయ్యారు.

అనాథలకు సేవలందించడం అమోఘం



రాజేష్‌ను సన్మానిస్తున్న మనీష్ కుమార్ అగర్వాల్

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట శాఖ అగర్వాల్ సత్యశక్తి మహిళా విభాగం అధ్యక్షులు నీతి అగర్వాల్ ఆధ్వర్యంలో సోమవారం చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైదరాబాద్ అగర్వాల్ సెంట్రల్ కమిటీ ప్రెసిడెంట్ మనీష్‌కుమార్ అగర్వాల్ గృహ అధ్యక్షులు మార్గం రాజేష్‌ను మహారాజ అగ్రసేన్ ఫొటో అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ.. అనాథ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సెంట్రల్ కమిటీ కోశాధికారి నవీన్ కుమార్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ కచన్ అగర్వాల్, సత్యశక్తి జనరల్ సెక్రటరీ రాణి మిట్టల్ పాల్గొన్నారు.